# పురుషులకు ప్రత్యేకం

### అడకత్తెరలో పోకచెక్క!

మా స్నేహితుడు, పైనంబంధం చేసుకుంటే వచ్చేభార్య ఎలాంటిదో తెలీదని మావయ్య కూతుర్ని చేసుకుంటే తెలిసినఅమ్మాయి కనుక సర్దుకుపోతుందనే భావంతో కట్నం ఇస్తామన్నా పైనంబంధాన్ని కాదని,

> స్త్రీలకు సంబంధించిన సమస్యలు చర్చించడానికీ, ఈ అంశంపై వివిధ అనుభవాల ను వివరించడానికీ ఉద్దేశించిన శీర్షిక యిది. మీమీ అనుభవాలను ఆసక్తిదాయకంగా—ఒక పేజీకి మించకుండా రాసి, 'పురుషులకు ప్రత్యేకం' శీర్షికకు పంపించండి. ప్రచురితమైన ప్రతిరచనకూ పారితోషికం ఉంటుంది.

స్వంత మావయ్యకూతుర్ని కట్నంలేకుండా పెళ్లి చేసుకున్నాడు. పైగా పెళ్లిఖర్చులకు వాళ్ళకి కొంతడబ్బు కూడా ఇచ్చాడు.

కన్నవారింట్లో రోజు గడవటం కష్టంగా ఉన్నా అత్తవారింట్లో ఆమె కోరికలన్నీ తీర్చేవారు. వాళ్లింట్లో ఉన్నది ముగ్గురే. భర్త, అత్త, తను. ఈ ముగ్గురి మధ్య ప్రతిదినం ఏదో విషయంలో తగువులే! ఇంట్లో పనిచూస్తే ఏమీ ఉండేదికాదు. వంటపని, అంట్లుతోముకోవడం తప్ప. నీళ్లు తెచ్చిపెట్టడానికి పనిమనిషి ఉండేది. మరి ఆ ఇంట్లో ఏ విషయంలో తగువులువచ్చేవో ఎవరికీ అంతు పట్టేదికాదు. కోడలుచేసే ప్రతిపనిలోను అత్త సహాయంచేసేది. ఏదో ఒకరోజు పనిచేయకపోతే ఆ రోజు ఆ ఇంటి కోడలు కూడా పని చేసేదికాదు. అత్త పనిచేసేటపుడు కోడలు సహాయంచేయకపోతే, ఆ అత్త మాత్రం ఎలా పనిచేస్తుంది? ఆ రోజు మళ్లీ గొడవ ప్రారంభం. ఈ తగువులు భరించలేక అత్త ఎప్పుడూ ఏదోఒక ఊరు వెళ్లిపోయేది.

ఒక అత్త విషయంలోనే కాదు. భర్త విషయంలో కూడా అలాగే ప్రవర్తించేది. ఆమె కోరిన కోరికలు తీరుస్తూ భర్త అప్పులపాలయ్యాడు. ఇంట్లో కలహాలవలన రోగగ్రస్తుడయ్యాడు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పులేదు.

ఇప్పుడు చెప్పండి. అటు భార్యను కాదనలేక, ఇటు తల్లిని ఒదార్చలేక మధ్యలో కుమిలిపోతున్న ఆ భర్త పరిస్థితి ఎలా ఉంటుందో!

—ఎస్.మురళీమోహన్, నరసన్నపేట

### హక్కులు తెలుసుకోండి!

మన రాజ్యాంగం, మన ప్రభుత్వం పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా అనేక హక్కులు కల్పించింది. కానీ నేడు ఎంతమంది స్త్రీలు తమహక్కులను సద్వినియోగం చేసుకొంటున్నారు? తమహక్కులను సద్వినియోగపర్చుకోవాలని చదువుకున్న స్త్రీలయినా అనుకుంటున్నారా అన్నది సందేహమే! నా సొంత అనుభవం ఒకటి వివరిస్తాను. ఒకసారి అమలాపురం నుండి రావులపాలెం వెళుతుంటే బస్సులో స్త్రీలకై కేటాయించిన సీట్లపై కొందరు పురుషులు కూర్చున్నారు. ఆ బస్సులో చదువుకున్న స్త్రీలు, చదువుకోని స్త్రీలు వున్నారు. కానీ ఒక్కరయినా ఆ స్త్రీల సీట్లలో కూర్చున్న వారిని ప్రశ్నించలేదు. రావులపాలెంలో బస్సు దిగుతున్నపుడు ఒక 50 ఏళ్ళ స్త్రీని ఆ విషయమై ప్రశ్నించాను. ఆవిడ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆవిడ నాతో "బాబూ... నువ్వు అడిగావు కాబట్టి చెబుతున్నాను. స్త్రీల సీట్లపై కూర్చోకూడదు, కూర్చున్నా స్త్రీలువస్తే వారికివ్వాలని మీకు తెలియాలికానీ, మేం వాళ్ళతో ఈ విషయానికి ఏంగొడవ పెట్టుకుంటాం?" అన్నారు. చదువుకున్నవారే ఇలా ఆలోచిస్తే ఇక చదువులేనివారి మాటేమిటి? స్త్రీల సీట్లపై కూర్చుని, లేవడానికి అభ్యంతరంచెప్పే పురుషులపై ఆయాస్త్రీలు ఫిర్యాదుచేస్తే బస్సు కండక్టరు అందుకు బాధ్యుడవుతాడు. కానీ స్త్రీలలో 'మనకెందుకులే' అనే సర్దుబాటుమనస్తత్వం వున్నంతకాలం అది నెరవేరదు.

ముందుగా స్త్రీలు తమకుగల హక్కులు తెలుసుకుని వాటిద్వారా తమఉన్నతికి పాటుపడాలి. ఆనాడే వరకట్నం మొదలైన సాంఘికనేరాలు సమాజం నుండి అదృశ్యమైపోతాయి. ఎప్పుడో మరో ఈశ్వరచంద్రవిద్యాసాగర్, గురజాడ, వీరేశలింగంవంటివారు వస్తేకానీ సమాజం మారదని స్త్రీలు అనుకోనవసరంలేదు. తమంతటతామే, తమస్థితిగతులను మార్చుకోగలిగే తెగువ, ధైర్యాలను ప్రదర్శిస్తే ఎంతోకొంత మార్పురాకతప్పదు.

—గంటి సుబ్రహ్మణ్యశర్మ, అమలాపురం

### తలవంచండి

అర్థంపర్థంలేని కొన్ని సంప్రదాయాలు, ఆచారాలు మన పెద్దవాళ్ళ సంకుచితస్వభావానికి నిదర్శనాలుగా నిలుస్తాయి. కొన్ని కొన్ని ఆచారాలు మనిషికి మంచిచేసేవి అయినా మరికొన్ని మరీమూర్ఖంగా అనిపిస్తాయి. విచారకరమయిన విషయం ఏమిటంటే అటువంటి మూఢఆచారాలను, సంప్రదాయాలను చదువుకున్న నేటి యువతీ యువకులు కూడా ఆచరణలో పెడుతున్నారు.

సాధారణంగా పెళ్ళి సమయంలో తలంబ్రాలు తప్పనిసరి. అయితే అలా తలంబ్రాలు పోసుకున్నప్పుడు పెళ్ళికూతురు తలవంచినా పెళ్లికొడుకు మాత్రం తలవంచకూడదనే నియమం ఒకటివుంది. ఒకవేళ అలా తలవంచినట్లయితే ఇక జీవితాంతం భార్యకులొంగివుండాల్సివస్తుందని అంటారు.

కానీ నిజానికి తలంబ్రాల సమయంలో తలవంచడానికి, జీవితంలో భార్యకు తలవంచడానికి ఎటువంటి సంబంధంలేదు. ఈ విషయం ఏమాత్రం జ్ఞానమున్న మనిషికయినా తెలుస్తుంది. సాధారణంగా పెళ్లికొడుకు పెళ్లికూతురుకంటే వయసులో పెద్దవాడయివుంటాడు. అంతేకాకుండా ఆడవారికన్న మగవారిలో పొడుగు ఎదగడం ఎక్కువగా ఉంటుంది.

అలాంటప్పుడు పెళ్ళికొడుకు తలవంచకుండా నిటారుగా వుంచేట్టయితే తలంబ్రాలు పోయడం పెళ్లికూతురికి ఎంతోకష్టమయినపని. అలాంటి శుభకార్యాలలో ఎవరికీ కష్టపడకుండా చూడాలి. పైగా తల పైకెత్తివున్న పెళ్ళికొడుకు కళ్ళలో తలంబ్రాలుపడే అవకాశం కూడా లేకపోలేదు. తలంబ్రాలుపోయాలని పైకిలేచే పెళ్ళికూతురు తూలిపడిపోయినా పడవచ్చు. కాబట్టి కాబోయే పెళ్ళికొడుకుల్లారా... తలలు వంచండి!

—బి.వెంకటేష్, విజయవాడ

---

చిట్టికథ:

## చివరి అస్త్రం

వినుర్గా యింట్లోకి ప్రవేశించి, టేబుల్ మీదకి పుస్తకాల్ని విసిరికొట్టి, కుర్చీలో కూర్చుని ధుమధుమలాడుతున్న మనవుడు సుబ్బారావుని చూసి, చిన్నగా నవ్వుకున్నారు తాత వెంకట్రావ్‌గారు. ఆయన ఏకైక కొడుక్కి పుట్టిన ఏకైక పుత్రరత్నం కాబట్టి, తనదగ్గరే వుంచుకుని డిగ్రీ చదివిస్తున్నారు. అందరి తాతయ్యల్లా వెంకట్రావ్ తాతయ్య ముసలి నస పెట్టరు. వయసు ఆయన శరీరానికే, మనసుకి రాలేదు.

"ప్రాప్తే షోడశవర్షాణి పుత్రం మిత్రవ దాచరేత్" అన్న రూల్‌లో పదహారేళ్ళు దాటితే కొడుకుని మిత్రుని లా చూడాలన్నారు కాబట్టి, మనవడికి కూడా అలాంటి సూత్రమే వర్తిస్తుందనే నూతన సూత్రాన్ని కనిపెట్టి, అక్షరాలా అమలు పెట్టేవారు. అందుకే నెమ్మదిగా మనవడి పక్కకిచేరి—

"ఏమయిందిరా అబ్బాయ్. మళ్లీ మీ హిస్టరీ లెక్చరర్ జోకొగాని వేశాడేంటి?" అని అడిగారు నవ్వుతూ.

"పో, తాతయ్యా, నీకన్నీ వెటకారాలే" కస్సుమన్నాడు సుబ్బారావు.

"పోనీ, సీతగాని ఏమైనా అన్నదా?" శాంతంగా అడిగారు తాతయ్య. అదిరిపడి, "నీ... నికెలా తెలుసు తాతయ్యా" అడిగాడు ఆశ్చర్యంతో.

"ఆ... మరేంలేదు. నీ నోటు పుస్తకాల్నిండా సీతకోటి కనిపిస్తేనూ" అని నవ్వారు తాతయ్య.

"హు... తనే పెద్ద అందగత్తెనని అనుకుంటుంది కాబోలు. మా క్లాసులో యింకా జెబున్నిసా, ఉన్నిమేరీ, రాధాబాయి, ఆండాళ్ళున్నారు. వాళ్ళింకా అందంగా వుంటారు. ఈ పిల్లేదో వినయంగా వుందికదా, పోనీలే

పావమని దగ్గరకెళ్ళి మాట్లాడితే, ఖస్సుమని, కరిచినంత పని చేస్తుందా?" రోషంగా అన్నాడు సుబ్బారావు.

"కోపంలో చాలా అందంగా కనిపించివుంటుందే సీత"సాగదీశారు తాతయ్యగారు.

"మరే... తాతయ్యా" అని వేళ్ళు విరిచేసి, గోళ్ళుకొరికేసి, మెలికలు తిరిగేసి, అంతలో జరిగిన పరాభవం గుర్తుకొచ్చి, "ఎంత అందంగా వుంటే మాత్రం అంతలే సిమాటలంటుందా?" అని మండిపడ్డాడు సుబ్బారావు.

"లవ్ అన్నది కారంగా మొదలై, తియ్యగా ముగుస్తుందిరా అబ్బీ! అయినా నీ లాంటి నత్రకాయలకు లవ్ అంటే ఏం తెలుస్తుందిరా? మా రోజుల్లో అంటే, అబ్బో అవో రోజులు..." అంటూ తాతయ్య తన్మయత్వంలో పడిపోతూవుంటే అడ్డుపడి—

"అయితే తాతయ్యా నువ్వూ ప్రేమించావన్నమాట" ఆశ్చర్యంగా అడిగాడు.


"సిల్కులాల్చీ, పంట్లాం వేసుకునే వయసు నాకూ ఒకప్పుడు వచ్చిందని మర్చిపోకురోయ్"

"సర్లేగానీ, ఇంతకీ నువ్వు ప్రేమించింది ఎవర్ని? కొంపదీసి మన బామ్మను కాదుకదా?" సందేహంగా అడిగాడు సుబ్బారావు.

"సాక్షాత్తూ నీ బామ్మనే... ఇప్పుడైతే వయస్సొచ్చి, నీ కంటికలా కనిపిస్తుంది కానీ, ఆ రోజుల్లో ఎలా వుండేదనుకున్నావ్. క్షణానికొక రూపంలా తోచేది. ఊసరివిల్లిలా అనుకునేవ్ సుమా. అదేంకాదు. వెలుతురు పొట్లంలా మెరిసేది. నందన వనంలా నడిచి వెళ్లేది. ఇప్పుడైతే మన పక్కింటి లావుపాటి పిన్నిగారు మీ బామ్మని 'ఇదిగో ఎంకట లక్షమ్మా!' అని మోటుగా పిలుస్తుందిగానీ, అప్పట్లో మా జట్టువారమంతా 'లక్ష్మీ లక్ష్మీ' అంటూ ఎంతో సుకుమారంగా స్మరించుకునేవాళ్ళం. మా జట్టులో మొత్తం నలుగురం వుండేవాళ్ళం..."

"ఆ నలుగురిలోకెల్లా అందగాడివి నువ్వేనని, ప్రేమించేసిందా?" ఠక్కున అడిగాడు సుబ్బారావు.

"ఆగరా వెధవ. పలి ఉద్రేకం తప్ప ఉపాయంలేని వయస్సు నీది."



"తిట్టకు తాతయ్యా... ఇంతకి బామ్మ ఎవర్ని ప్రేమించింది?"

"ఎవర్నీ ప్రేమించలేదు. లక్ష్మి అంటే ఏమిటనుకున్నావ్... నిప్పురా నిప్పు. మహాలక్ష్మి పాలకడలి నుండి పుడితే, మీ బామ్మ లక్ష్మి నిప్పు సముద్రంనుంచి పుట్టింది. మా జట్టులో నలుగురుండేవాళ్ళమని చెప్పాను కదా, అందులో తుకారాం అనే భావకవిగాడొకడుండేవాడు. వాడోరోజు వుండబట్టలేక, కాలేజీ వదిలేక, పెంపుడు కుక్కలా కాస్సేపు లక్ష్మి వెనకాల నడిచి, కాస్తదగ్గి "మీరెంతో అందంగా వున్నారు. వసంతంలా... ఉషోదయంలా... చంద్రోదయంలా" అంటూ మొదలెట్టాడు. మావాడి లాలాలా... కవిత్వం ముగిసేలోపు, లక్ష్మి వెనుదిరిగి, సాచిపెట్టి, ఒక్కటంటే ఒక్కటే లెంపకాయ కొట్టింది. వెధవ, మరీ బలహీనుడు కాబట్టి, ఆ మాత్రానికే స్పృహతప్పి పడిపోయాడు..."

"ఆఁ" అన్నాడు సుబ్బారావు.

"మరే... ఆ సంఘటనలో 'బ్రేవరీ అవార్డు'ని లక్ష్మికి యివ్వాల్సిందిగా ప్రభుత్వానికి ప్రిన్సిపాల్ సిఫారసు చేసినట్టు గుర్తు. వారం రోజులకు షాక్ నుండి తేరుకున్న తుకారాంగాడు మా దగ్గరకొచ్చి, భోరున ఏడ్చేశాడు. తను కాకపోయినా, తన జట్టులోవున్న మిగతా ముగ్గుర్లో ఒకడు లక్ష్మిని ప్రేమించి, పెళ్లి చేసుకోవాల్సిందేనని, అలా అయితేనే బ్రతికుండగానే తన ఆత్మకు శాంతి కలుగుతుందని, తన ఆత్మకు శాంతి చేయలేని మిత్రులు ఉండనేలా? ఊడనేలా? అని నానాగొడవ చేసి, 'కాబట్టి మీలో ఎవరైకా ధైర్యంవుంది' అని బహుగంభీరంగా అడిగాడు. ఆ పాటికే మిగతా యిద్దరు మిత్రులూ గోడల్దూకి పారిపోయారు. నావైపు దిగులుగా చూస్తూ 'నువ్వూ మిత్రదోహివేనా?" అని అడిగాడు. గుడ్లలో నీరు కుక్కుమని, 'కాదు' అన్నాను వాడ్ని కౌగలించుకుని. తర్వాత, ఎలాగైనా సాధిస్తానని కూడా అన్నాను.

"ఇంటికెళ్లి, లక్ష్మి ప్రేమ పొందడం ఎలా అన్న అంశంమీద ఆలోచించడం మొదలుపెట్టాను. తుకారాంగాడి చెంపదెబ్బ ఫ్లాష్‌బాక్‌లో మెరవగానే, నేను రూపొందించిన ప్రణాళికలన్నీ తుత్తునియలయ్యేవి. ఇలాకాదనిపించి, కాస్త డిటెక్షన్‌గత్రాచేసి, లక్ష్మి వివరాల్ని సేకరించాను. మెల్లగా అమ్మదగ్గర గారంచేసి, అసలు విషయం చెప్పాను. అమ్మ నవ్వుకుని, రాత్రిపూట నాన్నగారి చెవిలో ఆ వార్తని వేసింది. అంతే అగ్గిమీద గుగ్గిలంలా ఎగిరిపడ్డాడాయన. చెడామడాతిట్లతో చెడుగుడు ఆడేశాడు.

"డామిట్ అనిపించి ఓ రోజు ధైర్యం తెచ్చుకుని లక్ష్మి వెంటపడ్డాను. అట్టే జనసంచారం లేని చోటు చూసుకుని, "ల... ల... లక్ష్మిగారు" అన్నాను. "ఏమిటి" అన్నది కళ్ళతో. చలిజ్వరం మొదలై... "నీనీ... ప్రేప్రే" అంటూ వణుకుతుంటే, నావైపు తమాషాగాచూస్తూ, ఫక్కున నవ్వింది. గొల్లున నవ్వింది. నవ్వి నవ్వి వెళ్లిపోయింది. నన్ను లక్ష్మి ప్రేమించేసిందన్న ఆనందంతో యింటికి పరిగెట్టుకెళ్లి, అద్దంలో నన్ను నేను అభినందించుకుందామనుకుని, అద్దాన్ని చూస్తే, కుడిబుగ్గమీద, చెవులకిందా అంగుళం మందానవున్న పౌడరు చెమటకి అట్టకట్టుకుపోయి, దసరా వేషం వేసినట్టు కనిపించింది. నా ఫ్యాన్సీడ్రెస్ పెరేడ్‌కి తట్టుకోలేక నవ్విందన్నమాట. ఏడుపు వచ్చింది నాకు.

"ఇట్లాజరిగిన రెండువారాలకి, 'మరో రెండు రోజుల్లో కాలేజీ మూసేసి, ప్రిపరేషన్ హాలీడేస్ యిస్తార్రా. నీ ప్రేమ వ్యవహారం ఏమయింది?' అని మిత్రులు అడిగారు. 'ఈ రోజు అటో ఇటో తేలిపోతుంది' అని ధీమాగా అన్నాను.

"ఆ రోజు సాయంత్రం లక్ష్మి వస్తుండగా, ఎదురెళ్లి పలకరించాను. మళ్లీ ఏమిటన్నట్టు చూసింది. "ఏమీ అనుకోకపోతే పార్క్‌లోకి వస్తారా? మీతో మాట్లాడాలి" అన్నాను మాటల్ని సగం మింగేస్తూ. కోపంగా చూసింది. 'ప్లీజ్' అన్నాను. నా వాలకానికి జాలిపడి, మౌనంగా పార్క్‌లోకి వచ్చింది.

"పార్క్‌లోకి రావడానికి భయపడ్డ మిత్రులు బయటేనిలబడి ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. సరిగ్గా పదినిముషాలకు విజయగర్వంతో బయటికివస్తున్న నన్నూ సిగ్గుతో బుగ్గలు ఎరుపెక్కి, తియ్యగానవ్వుకుంటూ, కువకువలాడిపోతూ, రిక్షాఎక్కి తుర్రుమన్న లక్ష్మినీ చూసి, మిత్రబృందం ఆశ్చర్యపోయింది. తేరుకుని, షేక్‌హాండ్లిచ్చేసి, ఆనందాశ్రువుల్తో భోరుమంటూ, "ఎలా సాధించావు గురూ" అని అడిగారు. గర్వంగా నా సాహసకృత్యాన్ని చెప్పిముగించేలోగా, 'యూ రాస్కెల్... ఇడియట్' అని తిడుతూ, తన్నడానికి సిద్ధమయ్యేసరికి, పరుగులంకించుకున్నారా అబ్బాయీ" అని ముసిముసి నవ్వులు నవ్వారు తాతయ్య.

"ఇంతకీ పార్క్‌లో ఏం చేశావ్ తాతయ్యా" ఆరాటంగా అడిగాడు సుబ్బారావు.

'అదీ' అని తాతయ్య చెప్పేలోపు, "మీకసలు బుద్ధీ జ్ఞానం వుందా అంట. ఏళ్ళొచ్చాయి... ఎందుకూ... సిగ్గులేకపోతేసరి. చదువుకునే పిల్లాడ్ని చెడగొడుతున్నారు" అని అరుస్తూ బయటనుండి లోనికి ప్రవేశించింది బామ్మ వెంకటలక్ష్మి. తాతయ్య గప్‌చిప్ అయిపోయాడు నవ్వుకుంటూ. బామ్మ మనవడికేసి కోపంగా చూస్తూ, "ఒరే వెధవా... ముందక్కణ్ణుంచిలే... పద... భోజనం చేద్దువుగాని" అని మనవడ్ని లాక్కుపోయింది.

భోజనం వడ్డించి, తాతామనవళ్ళు తింటున్నంతసేపూ, మొగుడ్ని చాటుగా మురిపెంగా చూసుకుంటూ, పిల్లాడ్ని చెడగొడుతున్నందుకు మళ్లీ తిట్టిపోసింది. తాతయ్య తియ్యగా నవ్వుకుంటూ, భోజనం కానిచ్చి, చేతులు కడుక్కోడానికి బాత్‌రూంలోకి వెళ్ళాడు. వెనకే తనూ చేతులు కడుక్కునే నెపంమీద బాత్‌రూంలోకి దూరి—

"బామ్మని ఎలా సాధించావో త్వరగాచెప్పు తాతయ్యా" అన్నాడు సస్పెన్స్ భరించలేక.

"మరేంలేదురా అబ్బాయీ! పార్క్‌లో మీ బామ్మతో ప్రేమించానని అన్నాను. కోపంగా చూసింది. పెళ్లి అన్నాను. తంతానన్నట్టు చూసింది. ఇక లాభం లేదనుకుని ఆఖరి అస్త్రంగా పట్టుకున్నాను..."

"ఏం పట్టుకున్నావ్ తాతయ్యా"

"కాళ్ళు... కాళ్లు పట్టుకుని 'ఇవి చేతులనుకో' అన్నాను."

"రసికుడివి తాతయ్యా" మెచ్చుకోలుగా అన్నాడు మనవడు.

"బాత్‌రూంలో ఏమిటా గుసగుసలు" మళ్లీ అరిచింది వెంకటలక్ష్మి. ముసిముసి నవ్వుల్తో తాతయ్య బయటకు నడుస్తుంటే, అనుసరించాడు మనవడు సుబ్బారావు.

—ఎల్యూ నారాయణరావ్